నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, సోమవారం 23 డిసెంబర్ 2024 | RANGAREDDY

అమరవీరుల స్థూపం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు (ఫైల్)

హామీ నెరవేర్చరూ..!

పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి హామీ

ఏడాది గడిచినా క్రమబద్ధీకరణకు నోచుకోని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

ఇచ్చిన మాట అమలు చేయాలని సమ్మెబాటలో ఎంప్లాయీస్

17 రోజులుగా వివిధ రూపాల్లో కొనసాగుతున్న దీక్షలు

వికారాబాద్, డిసెంబర్ 22 : పీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి ఏడాది గడిచినా తమను ఇంకా క్రమ బద్ధీకరించకపోవడంతో విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. గత 17 రోజులుగా వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉద్యోగులు ధర్నాలు, ర్యాలీలు, వివిధ రీతుల్లో నిరసన తెలుపుతున్నారు. వంటావార్పు, అమరవీరుల స్థూపం వద్ద నిరసన, చాకలి ఐలమ్మ వేషధారణలో ఓ ఉద్యోగిని నిరసన తెలిపారు. హామీని అమలు చేసి.. తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు తక్షణమే పేస్కేల్‌ను అమలు చేయాలని, మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న ఉద్యోగులకూ న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తమను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, విద్యాశాఖ అధికారులను కలిసి వినతి పత్రాలు అందించినా ఫలితం లేకపోవడంతో వారు ఆందోళన బాట పట్టారు.

ఇందులో ఎంఆర్‌సీ, సీఆర్పీ, పాఠశాల, కేజీబీవీ, యూఆర్ఎస్, మోడల్ స్కూల్, డీపీవో స్థాయిలో అన్ని విభాగాల ఉద్యోగులు దాదాపుగా 750 మంది ఉన్నారు. ప్రభుత్వం స్పందించే వరకు తమ సమ్మె కొనసాగుతుందని ఉద్యోగులు స్పష్టం చేస్తున్నారు.

ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలి..

కులకచర్ల మండలంలో సీఆర్‌పీగా గత 12 ఏండ్లుగా పని చేస్తున్నా. ఎన్నికల ముందు పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్షా ఉద్యోగులందరినీ అధికారంలోకి రాగానే క్రమబద్ధీకరిస్తానని మాటిచ్చారు. కానీ ఏడాది దాటినా హామీని నెరవేర్చలేదు. జిల్లాలో 750 మంది ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారు.

– కేతావత్ గంగ్యానాయక్, జేఏసీ జిల్లా చైర్మన్, వికారాబాద్

చాయ్ తాగినంత సేపట్లో జీవో ఇస్తామన్నారు..

సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలు తనకు తెలుసు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చాయ్ తాగినంత సేపట్లో జీవోను విడుదల చేయిస్తానని అప్పటి పీసీసీ హోదాలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆయన సీఎం అయి ఏడాది దాటినా మమ్మల్ని పట్టించుకోవడం లేదు. గత 12 ఏండ్లుగా కేజీబీవీలలో పని చేస్తున్నా. సీఎం ఇచ్చిన మాటను వెంటనే నెరవేర్చాలి.

–ప్రభావతి, కేజీబీవీ, మామిన్‌పేట

సీఎం.. మాట నిలబెట్టుకోవాలి

సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించి.. ఇచ్చిన మాటను సీఎం నిలబెట్టుకోవాలి. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మెను కొనసాగిస్తాం.

–శ్రీశైలం, మెసెంజర్, పరిగి

సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా..

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను రెండు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చెప్పారని వికారాబాద్ జిల్లా సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంగ్యానాయక్ తెలిపారు. ఆదివారం వికారాబాద్‌కు వచ్చిన స్పీకర్‌కు ఆయన ఉద్యోగులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మెసెంజర్ సంఘం అధ్యక్షుడు శ్రీశైలం, విజయ్, రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించాలని స్పీకర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఉద్యోగులు

వీధి దీపాల పునరుద్ధరణకు చర్యలు

సిటీబ్యూరో, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే కింద వీధి దీపాల పునరుద్ధరణపై హెచ్ఎండీఏ దృష్టి పెట్టింది. ఇటీవల కాలంలో తరచూ లైటింగ్ సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో... వీటి నిర్వహణపై తీవ్ర విమర్శలొచ్చాయి. ముఖ్యంగా రాత్రి పూట ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో దీపాల మరమ్మతులు చేసేందుకు హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఫ్లైఓవర్ కింద(డక్) భాగంలో ఎల్ఈడీ లైట్లకు మరమ్మతులు చేయనున్నారు. పిల్లర్ నుంచి 1-272 వరకు డక్ కింద లైటింగ్ కోసం రూ. 44 లక్షలతో ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు పాత వైరింగ్, ఎర్తింగ్, లైట్ ఫెయిల్యూర్ వంటి సమస్యలు లేకుండా ఉండేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిత్యం ఎంసీబీ, లూజ్ వైరింగ్ కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోతుండడంతో మాన్యువల్ నిర్వహణలో భాగంగా పునరుద్ధరిస్తున్నట్లు హెచ్ఎండీఏ వర్గాలు పేర్కొన్నాయి. వచ్చే ఏడాదిలో పనులు ప్రారంభిస్తామని ఇంజినీరింగ్ అధికారులు వెల్లడించారు.

కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే అక్కడి సిబ్బంది నిబంధనలు, కొర్రీలతో విసిగిపోయిన అన్నదాతలు తమ ధాన్యాన్ని పక్క రాష్ట్రానికి చెందిన వ్యాపారులకు విక్రయిస్తున్నారు. జిల్లాలో పండించిన ధాన్యంలో దాదాపుగా 60 శాతం వరకు కర్ణాటక రాష్ట్రానికే తరలుతున్నట్లు సమాచారం. అక్కడి వ్యాపారులు రైతుల వద్దకు నేరుగా వచ్చి మద్దతు ధరకంటే అదనంగా రూ.500 చెల్లించి ధాన్యాన్ని కొంటున్నారు. కాగా జిల్లాలో ఖరీఫ్‌లో 1,05,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని అధికారులు లక్ష్యం గా పెట్టుకోగా.. కేవలం 34,766 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించారు.

- వికారాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ)

మన ధాన్యం.. పక్క రాష్ట్రానికి..

కర్ణాటకకు తరలుతున్న వికారాబాద్ జిల్లాలోని వడ్లు

మద్దతు ధరకు అదనంగా రూ.500 చెల్లించి మరీ కొంటున్న అక్కడి వ్యాపారులు

వారికే విక్రయిస్తున్న జిల్లాలోని తాండూరు, కొడంగల్, పరిగి సెగ్మెంట్లలోని రైతులు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అనేక కొర్రీలతో విసిగిపోయిన అన్నదాత

కొనుగోలు కేంద్రాల్లో తగ్గిన విక్రయం

అధికారులు నిర్దేశించిన లక్ష్యంలో సగం కూడా చేరుకోని వైనం

జిల్లాలో ఏర్పాటైన కొనుగోలు కేంద్రాలు 126

అధికారులు సేకరించింది కేవలం 34,766 మెట్రిక్ టన్నులే

రైతాంగం ఆగం

ఏడాది కాంగ్రెస్ పాలనలో రైతాంగం ఆగమయ్యింది. అధికారంలోకి వచ్చి 12 నెలలు దాటినా పంట పెట్టుబడి సాయం ఇవ్వకుండా.. అనేక కొర్రీలు, నిబంధనలు పెట్టి కొద్ది మంది రైతుల పంట రుణాలనే మాఫీ చేయగా.. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకూ సరైన మద్దతు ధర చెల్లించకపోవడంతో రైతులు తమ ధాన్యాన్ని పక్క రాష్ట్రానికి చెందినవారికి విక్రయిస్తున్నారు. ప్రభుత్వం జిల్లాలో వరి ధాన్యాన్ని కొనేందుకు 126 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా రైతులు తమ పంటను అక్కడ అమ్మేందుకు తీసుకెళ్లకపోవడంతో అవి బోసిపోయాయి. దీంతో అధికారులు వాటిని మూసేశారు. అధికారులు నిర్దేశించిన లక్ష్యంలో సగం ధాన్యాన్ని కూడా కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించలేకపోయారు. వానకాలంలో 1,05,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని టార్గెట్‌గా పెట్టుకోగా.. కేవలం 34,766 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించారు.

పక్క రాష్ట్రానికి 60 శాతం వరకు..

అయితే జిల్లాలో పండించిన ధాన్యంలో దాదాపుగా 60 శాతం వరకు కర్ణాటక రాష్ట్రానికి తరలుతున్నట్లు సమాచారం. అక్కడ వరి సాగు తక్కువగా ఉండడం.. ధాన్యానికి డిమాండ్ పెరిగి.. వికారాబాద్ జిల్లాలో పండించిన ధాన్యాన్ని కర్ణాటకకు చెందిన ప్రైవేట్ వ్యాపారులు తెలంగాణకు వచ్చి అధిక ధరకు కొనుగోలు చేసి లారీల ద్వారా తీసుకెళ్తున్నారు. మన దగ్గర క్వింటాల్‌కు రూ.2,320 ఉండగా, అక్కడి వ్యాపారులు క్వింటాల్‌కు మద్దతు ధరతోపాటు రూ.500 అధికంగా నేరుగా చెల్లించి ధాన్యాన్ని కొంటున్నారు. దీంతో జిల్లాలోని తాండూరు, కొడంగల్, పరిగి నియోజకవర్గాల్లోని రైతులు తమ పంటను కర్ణాటక వ్యాపారులకే విక్రయిస్తున్నారు.

పెండింగ్‌లో రూ.10 కోట్ల చెల్లింపులు..

ధాన్యాన్ని విక్రయించే సమయంలో తేమ శాతం అంటూ ఏదో విధంగా కొర్రీలు పెట్టే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు.. డబ్బుల చెల్లింపుల్లో అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ధాన్యాన్ని విక్రయించిన రైతులకు రెండు, మూడు రోజుల్లోగా చెల్లింపులు పూర్తి చేస్తామంటూ పౌరసరఫరాల అధికారులు ప్రకటించినా..విక్రయించిన 15-20 రోజుల తర్వాతే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయి. ధాన్యాన్ని సేకరించిన వెంటనే బిల్లులు చేయాల్సిన కొనుగోలు కేంద్రాల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే డబ్బులు వచ్చేందుకు ఆలస్యమవుతున్నదన్న ఆరోపణలున్నాయి. మరోవైపు జిల్లాలో వానకాలంలో 34,766 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 5449 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించగా ఇప్పటివరకు రూ.74 కోట్లను రైతుల ఖాతాల్లో జమ కాగా.. మరో రూ.10 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి.

గుప్పమంటున్న గంజాయి

రంగారెడ్డి జిల్లాలో యథేచ్ఛగా వ్యాపారం

అవుటర్ రింగ్ రోడ్డు కేంద్రంగా అక్రమ బిజినెస్

పాన్‌షాపులు, హోటళ్లలో నిల్వచేస్తూ.. ఇంజినీరింగ్ విద్యార్థులకు చేరవేస్తూ..

పోలీసులు చర్యలు తీసుకుంటున్నా ఫలితం నిల్

వనస్థలిపురం సమీపంలో పట్టుబడిన గంజాయి..

జిల్లాలో గంజాయి వ్యా పారం యథేచ్ఛగా సాగుతున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ చుట్టూ జిల్లా విస్తరించి ఉండడంతో వ్యాపారులు పలు ప్రాంతాలను ఎంచుకుని తమ దందాను కొనసాగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణలోని పలు జిల్లాల నుంచి గంజాయిని అవుటర్ రంగ్ రోడ్డు (ఓఆర్ఆర్) మీ దుగా హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాలకు చేరవేస్తున్నారు. పోలీసు లు ఉక్కుపాదం మోపుతున్నా ఎక్కడో ఒక చోట గంజాయి ముఠా వారికి చిక్కుతూనే ఉన్నది. ముఖ్యంగా ఎల్బీనగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్ డివిజన్ల పరిధిలో ఇటీవల సుమారు 20 మంది వరకు గంజాయి వ్యాపారులు పోలీసులకు పట్టుపడగా వారి నుంచి వందల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, చేవెళ్ల, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో ఇంజినీరింగ్ కళాశాలలు, హాస్టళ్లు అధికంగా ఉం డడంతో ఈ ప్రాంతాలను ఎంచుకుని వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. బస్టాండ్లలోని పాన్‌షాపులు, చాయ్ హోటళ్లు, ఇంజినీరింగ్ కళాశాలల ఎదుట ఉండే పాన్‌షాప్‌లు, హోటళ్లను ఎంచుకుని.. అక్కడ గంజాయిని నిల్వ చేస్తూ విద్యార్థులకు చేరవేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

-రంగారెడ్డి, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ)

జిల్లాలో ఇటీవల నమోదైన కేసులు..

ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం అల్లూరి ఏజెన్సీ, తెలంగాణలోని ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు తెలుస్తున్నది.

- ఇటీవల ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొందరు కారులో తరలిస్తున్న 60 కిలోల గంజాయిని మాల్ చెక్‌పోస్టు వద్ద యాచారం, మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు.
- మహారాష్ట్రకు చెందిన కొందరు గుట్టుచప్పుడు కాకుండా దండుమైలారం మీదుగా ఇబ్రహీంపట్నానికి తరలిస్తుండగా ఇబ్రహీంపట్నం పోలీసులు తాళ్లపల్లిగూడగేటు వద్ద పట్టుకుని వారి నుంచి 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- ఆదిబట్ల ఠాణా పరిధిలోని కొంగరకలాన్ నుంచి తుక్కుగూడ వెళ్లే దారిలో ముంబైకి చెందిన వ్యక్తులను తనిఖీ చేయగా వారి వద్ద 1550 గ్రాము ల గంజాయి లభ్యమైనది.
- ఆదిబట్ల ఠాణా పరిధిలోని బొంగుళూరు గేటు వద్ద జార్ఖండ్ రాష్ట్రం నుంచి తీసుకొస్తున్న 142 ప్యాకెట్ల గంజాయిని ఎల్బీనగర్ ఎస్‌వోటీ, ఆదిబట్ల పోలీసులు కలిసి పట్టుకున్నారు.
- కొంగరకలాన్ కల్వకోలు లక్ష్మీదేవమ్మ ఫంక్షన్‌హాల్ సమీపంలో ఒడిశాకు చెందిన వారి నుంచి 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- తుక్కుగూడ సమీపంలోని వండర్ లా వద్ద ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న వారికి గంజాయిని విక్రయిస్తున్న కొంత మందిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా 21 కిలోల గంజాయి లభ్యమైనది.
- ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి నుంచి రూ. 30 లక్షల విలువ చేసే 3.8 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.
- రాజస్థాన్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు నాదర్‌గుల్‌లో నివసిస్తూ నిషేధిత మత్తు పదార్థాలను విక్రయిస్తుండగా గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే, నిజామాబాద్‌కు చెందిన ఓ ముఠా, ఆంధ్ర ప్రదేశ్ నుంచి 62 కిలోల గంజాయిని ఔటర్‌రింగ్‌రోడ్డు మీదుగా తరలిస్తుండగా తుక్కుగూడ వద్ద మహేశ్వరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
- ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు కారులో తరలిస్తున్న పది కిలోల గంజాయిని బీఎన్‌రెడ్డినగర్ సమీపంలో మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఔటర్ చుట్టూ యథేచ్ఛగా..

జిల్లాలో ఔటర్ రింగ్ రోడ్డు విస్తరించి ఉన్న పెద్దఅంబర్‌పేట, శంషాబాద్ , హిమాయత్‌సాగర్ వరకు ఇరువైపులా ఉన్న ప్రాంతాల్లో గంజాయి వ్యాపారం గుట్టుగా సాగుతున్నది. తుక్కుగూడ, మహేశ్వరం, ఆదిబట్ల, కొంగరకలాన్ తదితర ప్రాంతాల్లోని ఇటుక బట్టీల వద్ద ఒడిశా, బీహార్ రాష్ట్రాలకు చెందిన అనేక మంది కూలీలు పనిచేస్తున్నారు. వారి కోసం ఆయా ప్రాంతాలకు వ్యాపారులు గంజాయిని తరలించి విక్రయిస్తున్నారు. అలాగే, ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్‌లు, హాస్టళ్లు, ఇంజినీరింగ్ కళాశాలల్లోనూ ఈ వ్యాపారం పెద్ద ఎత్తున సాగుతున్నది.

గంజాయి కట్టడికి ప్రత్యేక టీంలు

గంజాయి వ్యాపారాన్ని అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. మహేశ్వరం డివిజన్ పరిధిలోని పలు ఠాణాలను కలుపుకొని ఎస్‌వోటీ బృందాలు పనిచేస్తున్నాయి. ఇటీవల వ్యాపారులను అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. వారిపై కేసులు పెడుతున్నాం. ఎక్కువసార్లు గంజాయిని విక్రయిస్తూ పట్టుబడిన వారిపై పీడీయాక్టులు నమోదు చేస్తాం. విద్యార్థులు, యువత గంజాయి వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి.

–సునీతారెడ్డి, మహేశ్వరం డీసీపీ

నిందితుడితో పోలీసులు

బల్దియా బడ్జెట్ ఖరారు

నేడు స్టాండింగ్ కమిటీ ముందుకు..

రూ. 8,440 కోట్లతో తాజా ముసాయిదా

గతంలో కంటే రూ. 100 కోట్లు పెరిగిన సవరణ బడ్జెట్

సిటీబ్యూరో, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ఎట్టకేలకు రానున్న ఆర్థిక సంవత్సరం (2025-26)కు సంబంధించిన బడ్జెట్‌ను ఖరారు చేశారు. రూ. 8,440 కోట్లతో తాజా ముసాయిదాను సిద్ధం చేసిన ఫైనాన్స్ విభాగం అధికారులు సోమవారం జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యుల ముందు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించనున్నారు. ఆదాయానికి, వ్యయానికి పొంతన లేదని గత స్టాండింగ్ కమిటీ సమావేశంలో అభ్యంతరాలు వ్యక్తం చేయడం.. బడ్జెట్ పారదర్శకంగా ఉండాలని సభ్యుల సూచనల మేరకు మార్పులు చేశారు. రూ. 8340 కోట్లతో రూపొందించిన బడ్జెట్ సభ్యుల సూచనల మేరకు బడ్జెట్‌ను రూ. 100కోట్ల మేర పెంచి రూ. 8440 కోట్లుగా బడ్జెట్‌ను సిద్ధం చేశారు. బల్దియాకు ఆదాయాన్ని సమకూర్చే ప్రాపర్టీ ట్యాక్స్, ట్రేడ్ లైసెన్స్, ఎస్టేట్స్, ప్రకటనల నుంచి రావాల్సిన రెవెన్యూ సక్రమంగానే చూపించారా? లేదా అన్నది ఈ స్టాండింగ్ సమావేశంలో తేలనున్నది.

కేటాయింపులు ఇలా ..

హెచ్ సిటీ ప్రాజెక్టులకు రూ. 1237 కోట్లు, రహదారులకు రూ. 650 కోట్లు, సమగ్ర రోడ్డు నిర్వహణకు రూ. 185కోట్లు, నాలాలు, డ్రైయిన్లు రూ. 200 కోట్లు పార్కులు, పచ్చదనానికి రూ. 208 కోట్లు, చెరువులు, వారసత్వ కట్టడాల పరిరక్షణకు రూ. 173, అప్పులు రూ. 1933కోట్లు, ఇంకుడు గుంతలకు రూ. 72కోట్లు, ఇంజినీరింగ్ నిర్వహణ పనులకు రూ. 314, హెల్త్ శానిటేషన్ విభాగానికి రూ. 600కోట్లు కేటాయించారు. హౌసింగ్‌కు రూ. 300కోట్లు కేటాయింపులు జరిపారు.

బడ్జెట్ సవరించారు ఇలా...

అంశం	గత స్టాండింగ్ కమిటీ సమావేశం	ప్రస్తుతం (రూ.కోట్లలో)
రెవెన్యూ ఆదాయం	4,445	4,205
రెవెన్యూ వ్యయం	4,000	3,936
రెవెన్యూ మిగులు	445	269
క్యాపిటల్ ఆదాయం	4440	4404
క్యాపిటల్ వ్యయం	4,440	4404

–రెవెన్యూ వ్యయంలో రూ. 64 కోట్లు, క్యాపిటల్ వ్యయంలో రూ. 36 కోట్లు పెంచి సవరణ బడ్జెట్‌ను రూ.100కోట్లు పెంచారు. సవరణలో భాగంగా ఆస్తిపన్ను, టౌన్ ప్లానింగ్, ట్రేడ్ లైసెన్స్, ప్రకటనలు ఫీజుల ద్వారా దాదాపు రూ. 228 కోట్లు ఆదాయం అదనంగా చూపారు. కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లను రూ. 419 కోట్ల నుంచి రూ. 279 కోట్లకు తగ్గించారు. కూడికలు, తీసివేతలతో మొత్తంగా రూ. 100కోట్లు పెంచారు.